


కోహ్లీ (43)

# కోహ్లీ 18 ఏండ్ల కల సాకారం
## భావోద్వేగానికి లోనైన దిగ్గజ క్రికెటర్

ఒకటా, రెండా ఏకంగా 18 ఏండ్లు కండ్లు కాయలు కాసేలా చూసిన వైనం. 2008లో ఏ క్షణాన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) చేరాడో అప్పటి నుంచి ఇప్పటి వరకు తన అణువణువు జట్టు కోసం ధారపోసిన కోహ్లీ కన్న కల ఇన్నాళ్లకు సాకారమైంది. అండర్-19 ప్రపంచకప్‌తో మొదలైన కోహ్లీ విజయ ప్రస్థానంలో మరో కలికితురాయి చేరింది. తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో వన్డే, టీ20 ప్రపంచకప్‌లకు తోడు చాంపియన్స్ ట్రోఫీ లాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలను ముద్దాడిన కోహ్లీకి ఐపీఎల్ టైటిల్ ఇన్నాళ్లు అందని ద్రాక్షగా ఊరిస్తూనే వచ్చింది. ఏడాది ఏడాదికి 'ఈ సాలా కప్ నమ్దే' అంటూ అభిమానుల ఆశలు మోసుకుంటూ లీగ్‌లో అడుగుపెట్టిన ప్రతీసారి ఆర్సీబీకి ఆశాభంగమే అయ్యింది. ఏబీ డివిలియర్స్, క్రిస్ గేల్, షేన్ వాట్సన్, అనిల్ కుంబ్లే, రాహుల్ ద్రవిడ్ లాంటి దిగ్గజాలు ప్రాతినిధ్యం వహించిన ఆర్సీబీ కన్న కల ఇన్నేండ్లకు నెరవేరింది. అభిమానుల ఆశలు ఫలించిన వేళ 18 ఏండ్ల విరామం తర్వాత జూన్ 3, 2025న ఆర్సీబీ తొలిసారి ఐపీఎల్ ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. గత సీజన్ల లాగే ఈసారి ఆర్సీబీకి టైటిల్ సాధ్యమయ్యేనా అన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ కల కప్‌ను సొంతం చేసుకుంది. పంజాబ్ కింగ్స్‌తో హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో ఆర్సీబీ ఆరు పరుగుల తేడాతో చిరస్మరణీయ విజయం సాధించింది. ఈ ప్రయాణంలో కోహ్లీ కల నెరవేరడం మరిచిపోలేని మధుర జ్ఞాపకం. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ, అంచనాలకు మించి రాణించిన ఆర్సీబీ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. ఈ ప్రయాణంలో కోహ్లీ పాత్ర మరువలేనిది. మ్యాచ్ మరో రెండు ఓవర్లలో ముగుస్తుందనగా అప్పటికే ఒక అంచనాకు వచ్చిన కోహ్లీ తన భావోద్వేగాన్ని నియంత్రించుకోలేకపోయాడు. ఉబికి వస్తున్న కన్నీటిని దిగమింగుకుంటూ విజయం సాధించగానే మైదానంలో అలాగే కూర్చుండిపోయాడు. సహచరులందరితో చిరస్మరణీయ విజయాన్ని ఆస్వాదిస్తూ మైదానం మొత్తం కలియతిరిగాడు. తన భార్య అనుష్కశర్మను అప్యాయంగా కౌగిలించుకుంటూ విజయాన్ని ఆస్వాదించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కోహ్లీ మాట్లాడుతూ 'ఈ విజయం జట్టుకే కాదు మాకు ఎల్లవేళలా మద్దతుగా నిలిచిన అభిమానులకు చెందుతుంది. ఆర్సీబీతో 18 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణంలో యువకునిగా మొదలై, ఎంతో అనుభవం గడించాను. ప్రతీ సీజన్‌లో నా శక్తినంతా ధారపోశాను. ఇన్ని రోజులకు సాధించడం మరిచిపోలేని అనుభూతి. చివరి బంతి తర్వాత భావోద్వేగాన్ని నియంత్రించుకోలేకపోయాను. నా హృదయం, శరీరం బెంగళూరుతోనే' అని అన్నాడు.

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

# ఈ సాలా కప్ ఆర్సీబీదే


కృనాల్ (2/17)
భువనేశ్వర్ (2/38)

**ఐపీఎల్ ట్రోఫీ కోసం 18 ఏండ్లుగా వేచి చూస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కల ఎట్టకేలకు నెరవేరింది. రెండు నెలల పాటు పదిజట్లతో సాగిన ధనాధన్ సమరంలో ఒక్కో మెట్టు అధిగమిస్తూ, ఎదురైన సవాళ్లను దాటుకుంటూ ఫైనల్ చేరిన ఆర్సీబీ.. 18వ సీజన్‌లో తమ టైటిల్ కలను నెరవేర్చుకుంది. ఐపీఎల్‌లో ప్రతి సీజన్ ఆరంభానికి ముందు 'ఈ సాలా కప్ నమ్దే' అంటూ హంగామా చేసే అభిమానుల ఆశలను నెరవేర్చుతూ టైటిల్‌ను తొలిసారి ముద్దాడింది. సీజన్ ఆసాంతం దుమ్మురేపిన పంజాబ్ కింగ్స్‌కు మరో సారి ఆఖరి మెట్టుపై నిరాశ తప్పలేదు. బంతితో పాటు బ్యాట్‌తోనూ విఫలమైన ఆ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది.**

## 18వ సీజన్‌లో తీరిన బెంగళూరు కల

- ఫైనల్‌లో తడబడ్డ పంజాబ్
- ఆర్సీబీ ఖాతాలో తొలి టైటిల్
- రాణించిన బెంగళూరు బౌలర్లు
- తుది మెట్టుపై కింగ్స్ బోల్తా

అహ్మదాబాద్: 18 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్‌లో తొలి టైటిల్‌ను ముద్దాడింది. మంగళవారం అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్‌తో హోరాహోరిగా జరిగిన ఫైనల్‌లో ఆర్సీబీ.. ఆరు పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. బెంగళూరు నిర్దేశించిన 191 పరుగుల ఛేదనలో పంజాబ్.. 184/7 వద్దే ఆగిపోవడంతో మొదటి టైటిల్ నెగ్గాలన్న ఆ జట్టు ఆశలు అడియాసలయ్యాయి. ఛేదనలో శశాంక్ సింగ్ (30 బంతుల్లో 61 నాటౌట్, 3 ఫోర్లు, 6 సిక్సర్లు), జోష్ ఇంగ్లిస్ (23 బంతుల్లో 39, 1 ఫోర్, 4 సిక్సర్లు) పోరాడినా ఆ జట్టుకు నిరాశ తప్పలేదు. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (35 బంతుల్లో 43, 3 ఫోర్లు) నెమ్మదిగా ఆడినా కెప్టెన్ రజత్ పటీదార్ (16 బంతుల్లో 26, 1 ఫోర్, 2 సిక్సర్లు), జితేశ్ శర్మ (10 బంతుల్లో 24, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), లివింగ్‌స్టొన్ (15 బంతుల్లో 25, 2 సిక్సర్లు) మెరుపులతో ఆ జట్టుకు పోరాడగలిగే స్కోరును అందించారు.

### పడుతూ లేస్తూ..

మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు ఇన్నింగ్స్ పడుతూ లేస్తూ సాగింది. ఒకవైపు స్కోరుబోర్డు వేగంగానే కదులుతున్నా మరోవైపు కీలక సమయంలో వికెట్లు కోల్పోవడం ఆ జట్టు భారీ స్కోరు ఆశలపై నీళ్లు చల్లింది. అర్ష్‌దీప్ మొదటి ఓవర్‌లోనే 6, 4తో ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన ఫిల్ సాల్ట్ (16).. జెమీసన్ వేసిన రెండో ఓవర్లో భారీ షాట్ ఆడబోయి మిడాన్ వద్ద శ్రేయాస్ చేతికి చిక్కాడు. మూడో స్థానంలో వచ్చిన మయాంక్ (24) రెండు బౌండరీలు ఓ సిక్సర్‌తో టచ్‌లోనే కనిపించినా ఏడో ఓవర్లో బంతినందుకున్న చాహల్.. రెండో బంతికి అతడి ఇన్నింగ్స్‌కు తెరదించాడు. కెప్టెన్ రజత్ కూడా ఓ బౌండరీ, రెండు సిక్సర్లతో రెచ్చిపోయినా జెమీసన్ పదో ఓవర్లో వికెట్ల ముందు దొరికిపోయాడు. మరో ఎండ్‌లో కోహ్లీ.. ఆరంభం నుంచే వికెట్లు కోల్పోవడంతో తన సహజశైలికి భిన్నంగా ఆడాడు. 11 ఓవర్ల వరకు అతడు ఆడిన బంతులు 22 కాగా చేసిన పరుగులు 28 మాత్రమే. అజ్మతుల్లా 15వ ఓవర్‌లో షార్ట్ బాల్‌గా వేసిన ఐదో బంతిని ఆడబోయిన కోహ్లీ.. బాల్ కాస్తా బ్యాట్ ఎడ్జ్‌కు తాకి అక్కడే పైకి లేవడంతో కోహ్లీ కథ ముగిసింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జితేశ్ ఉన్నంతసేపు మెరుపులు మెరిపించడంతో ఆర్సీబీ స్కోరుబోర్డు మళ్లీ వేగం పుంజుకుంది. అర్ష్‌దీప్ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన జితేశ్.. జెమీసన్ మరుసటి ఓవర్లో రెండు భారీ సిక్సర్లు బాదాడు. ఇదే ఓవర్లో లివింగ్‌స్టొన్ ఓ సిక్సర్ కొట్టి ఐదో బంతికి ఎల్బీగా వెనుదిరగ్గా విజయ్ కుమార్ 18వ ఓవర్లో జితేశ్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. షెపర్డ్ (17) క్రీజులో ఉన్నా ధాటిగా ఆడలేకపోయాడు. అర్ష్‌దీప్ ఆఖరి ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టాడు.

### కింగ్స్ తడబాటు

ఛేదనలో పంజాబ్ ఇన్నింగ్స్ సైతం ఒడిదొడుకుల మధ్యే కొనసాగింది. భువనేశ్వర్ వేసిన తొలి బంతినే బౌండరీకి తరలించి ఛేదనను ప్రారంభించిన ప్రియాన్ష్ (19 బంతుల్లో 24, 4 ఫోర్లు), ఎదుర్కొన్న రెండో బంతినే సిక్సర్‌గా మలిచిన ప్రభ్‌సిమ్రన్ (22 బంతుల్లో 26, 2 సిక్సర్లు) తొలి వికెట్‌కు 5 ఓవర్లలో 43 రన్స్ జోడించారు. వీళ్లు పవర్ ప్లేలో వేగంగా రన్స్ రాబట్టలేకపోయారు. హాజిల్‌వుడ్ ఐదో ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన ప్రియాన్ష్.. ఆఖరి బంతికి బౌండరీ లైన్ వద్ద సాల్ట్ సూపర్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. ప్రభ్‌సిమ్రన్‌ను కృనాల్ ఔట్ చేశాడు. పంజాబ్ భారీ ఆశలు పెట్టుకున్న 'సర్పంచ్ సాబ్' శ్రేయాస్ (1).. షెపర్డ్ బౌలింగ్‌లో జితేశ్ శర్మకు క్యాచ్ ఇవ్వడంతో కింగ్స్‌కు ఊహించని షాక్ తగిలింది. ఓవర్ వ్యవధిలో రెండు వికెట్లు కోల్పోయినా దూకుడుగా ఆడిన ఇంగ్లిస్‌ను కృనాల్ 13వ ఓవర్లో ఔట్ చేసి ఆ జట్టుకు మరో షాకిచ్చాడు. ఈ క్రమంలో బెంగళూరు బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో పంజాబ్ ఒత్తిడికి లోనైంది. ఆరు ఓవర్లలో ఆ జట్టు విజయానికి 85 పరుగులు అవసరం కాగా.. ఆ జట్టు 184 వద్దే ఆగిపోయింది. భువి ఒకే ఓవర్లో వధేర (15), స్టోయినిస్ (6)ను ఔట్ చేసి మ్యాచ్‌ను పూర్తిగా బెంగళూరు వైపునకు తిప్పాడు. శశాంక్ ఆఖరి ఓవర్లో మెరుపులు ఆ జట్టు ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించాయి.

**విజేత:**
బెంగళూరు
రూ.20 కోట్లు

**రన్నరప్**
పంజాబ్
రూ.12.50 కోట్లు

**ఆరెంజ్ క్యాప్**
సాయి సుదర్శన్ (759 పరుగులు)

**పర్పుల్ క్యాప్**
ప్రసిద్ధ్ కృష్ణ (25 వికెట్లు)

| | |
|---|---|
| ఎమర్జింగ్ ప్లేయర్: | సుదర్శన్ |
| ఫెయిర్‌ప్లే అవార్డు: | చెన్నై సూపర్‌కింగ్స్ |
| గ్రీన్ డాట్‌బాల్స్: | సిరాజ్ |
| అత్యంత విలువైన ప్లేయర్: | సూర్యకుమార్ |
| సూపర్ స్ట్రైకర్: | వైభవ్ సూర్యవంశీ |

### సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 190/9 (కోహ్లీ 43, రజత్ 26, అర్ష్‌దీప్ 3/40, జెమీసన్ 3/48); పంజాబ్: 20 ఓవర్లలో 184/7 (శశాంక్ 61, ఇంగ్లిస్ 39, కృనాల్ 2/17, భువనేశ్వర్ 2/38)




# స్ఫూర్తినింపేలా..
## ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ముగింపు కార్యక్రమం • హోరెత్తించిన శంకర్ మహాదేవన్ బృందం

అహ్మదాబాద్: పంజాబ్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) మధ్య ఐపీఎల్ ఫైనల్‌కు వేదికైన నరేంద్రమోదీ స్టేడియంలో ముగింపు కార్యక్రమం అభిమానులను ఆకట్టుకుంది. ప్రపంచంలోనే పెద్ద స్టేడియంగా పేరు గాంచిన మోతెరాలో కిక్కిరిసిన అభిమానుల మధ్య ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ శంకర్ మహాదేవన్ బృందం ఆలపించిన పాటలు ఫ్యాన్స్‌ను అమితంగా అలరించాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యానికి తగ్గట్లు జాతీయ స్ఫూర్తి ప్రతిబింబించేలా మహాదేవన్‌తో పాటు అతని కొడుకులు సిద్ధార్థ్, శివమ్ పాడిన దేశభక్తి పాటలకు అభిమానుల ఈలలు, కేరింతలు తోడయ్యాయి. వార్ నేపథ్యంలో రూపుదిద్దుకున్న లక్ష్య సినిమాలోని 'కందో సే మిల్తే హే కందె' 'యే వతన్ మేరే అబాద్ రహే తు', 'వందే మాతరమ్' పాటలకు తగ్గట్లు డ్యాన్సర్లు వేసిన స్టెప్పులకు అభిమానులు ఫిదా అయిపోయారు. వీటికి తోడు 'దుష్మన్ కే చక్కే చుడాదే హమ్ ఇండియా వాలే' పాటతో కార్యక్రమానికి మరో స్థాయి తీసుకెళ్లిన శంకర్..'సబ్సే ఆగే హోంగే హిందూస్తానీ' అనే పాటతో ఘనంగా ముగింపు పలికారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన 26 మంది అమాయకుల ప్రాణాలకు ప్రతీకారంగా భారత త్రివిధ దళాలు 'ఆపరేషన్ సిందూర్' పేరిట నిర్వహించిన మిషన్ దేశ సైనిక శక్తిని ప్రపంచానికి ఘనంగా చాటిచెప్పిన సంగతి తెలిసిందే.

# సెమీస్‌లో స్వియాటెక్, సబలెంక
## రసవత్తర పోరుకు రంగం సిద్ధం • క్వార్టర్స్‌లో జెంగ్‌కు షాక్



పారిస్: సీజన్ మూడో గ్రాండ్ స్లామ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో మరో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. ఆధునిక టెన్నిస్‌లో మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్స్‌గా కొనసాగుతున్న ఇగా స్వియాటెక్ (పోలండ్), బెలారస్ బామ అరీనా సబలెంక మరోసారి ముఖాముఖి తలపడనున్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ వేర్వేరు మ్యాచ్‌లలో ఈ ఇద్దరూ తమ ప్రత్యర్థులను చిత్తు చేసి సెమీస్‌లో కీలకపోరుకు సిద్ధమయ్యారు. ఎర్రమట్టి కోర్టులో తనకు తిరుగులేదని నిరూపిస్తూ ఐదో సీడ్ స్వియాటెక్ 6-1, 7-5తో ఎలీనా స్విటోలినా (ఉక్రెయిన్)ను వరుస సెట్లలో చిత్తు చేసింది. మ్యాచ్‌లో స్వియాటెక్ 3 ఏస్‌లు, 23 విన్నర్లు కొట్టింది. మరో పోరులో ఒకటో సీడ్ సబలెంక 7-6 (7/3), 6-3తో కిన్వెన్ జెంగ్ (చైనా)ను ఓడించింది. గ్రాండ్‌స్లామ్ ఈవెంట్స్‌లో సబలెంకకు ఇది 11వ సెమీఫైనల్.

# భారత్ వల్లే ఒలింపిక్స్‌లో క్రికెట్ | రిషి సునక్



అహ్మదాబాద్: శతాబ్ద కాల విరామం తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడానికి భారత్ ప్రధాన కారణమని బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునక్ అభిప్రాయపడ్డారు. క్రికెట్ ప్రేమికుడైన సునక్.. ఐపీఎల్-18 ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు అహ్మదాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా సునక్ మాట్లాడుతూ.. '21వ శతాబ్దిలో ప్రపంచ క్రికెట్‌పై భారత్ అధికంగా ప్రభావం చూపింది. ఆట పట్ల ఇక్కడ ఉన్న అభిరుచి ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. ఒలింపిక్స్‌లో వందేండ్ల తర్వాత క్రికెట్‌ను చేర్చడానికి ప్రధాన కారణం భారత్' అని అన్నారు. 1900 ఒలింపిక్స్ తర్వాత 2028లో లాస్ ఏంజెల్స్ వేదికగా జరుగబోయే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చిన విషయం విదితమే. భారత్‌లో జరిగే ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ పైనా సునక్ ప్రశంసలు కురిపించారు.

# ట్రాఫిక్‌లో చిక్కి.. మ్యాచ్ కోసం సైకిళ్లెక్కి..
## ఇంగ్లండ్, విండీస్ ప్లేయర్లకు వింత అనుభవం



ఓవల్: లండన్‌లో ట్రాఫిక్ కష్టాలతో ఇంగ్లండ్, వెస్టిండీస్ క్రికెట్ స్టార్లకు వింత అనుభవం ఎదురైంది. ఇరు జట్ల మధ్య ది ఓవల్ వేదికగా జరిగిన మూడో వన్డేకు ముందు ట్రాఫిక్ కారణంగా టాస్ ఏకంగా 40 నిమిషాలు ఆలస్యమవడం గమనార్హం. వివరాల్లోకెళ్తే.. మ్యాచ్ కోసం ఇరు జట్ల ఆటగాళ్లు హోటల్ నుంచి టీమ్ బస్సుల్లో స్టేడియానికి బయల్దేరారు. అయితే ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో ఇంగ్లండ్ క్రికెటర్లు ఇక లాభం లేదనుకుని సైకిళ్ల సాయంతో అక్కడ్నుంచి బయటపడి మైదానానికి చేరుకున్నారు. కానీ వెస్టిండీస్ ఆటగాళ్లు మాత్రం టీమ్‌బస్సులోనే ఉండిపోయారు. టాస్ సమయానికి కూడా విండీస్ ప్లేయర్లు మైదానానికి రాలేకపోవడంతో అంపైర్లు టాస్ సమయాన్ని 40 నిమిషాలు పొడిగించడం విశేషం. టాస్ ఆలస్యానికి తోడు వర్షం కారణంగా మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించారు.

# 'ఎల్లంపల్లి' చేపలకు కోళ్ల వ్యర్థాలే మేత

- కబ్జా చెరువుల్లో మరో కోణం
- నిత్యం టన్నులకొద్దీ కుళ్లిన మాంసం
- కరీంనగర్, రామగుండం నుంచి చికెన్ వ్యర్థాల సేకరణ
- విసర్జిత జలాలు ఎల్లంపల్లిలోకే పంపింగ్..
- జలాశయం కలుషితం.. అదేనీరు హైదరాబాద్‌కు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


కబ్జా చేసి నిర్మించిన చేపల చెరువుల్లో మాంసం వ్యర్థాలు

పెద్దపల్లి, జూన్ 3(నమస్తే తెలంగాణ): ఎల్లంపల్లి ప్రాజెక్టులోని అక్రమ చెరువుల్లోని చేపలకు కోళ్ల వ్యర్థాలే మేతగా వేస్తున్నారు. నిత్యం టన్నులకొద్దీ కుళ్లిన చికెన్, మటన్ పదార్థాలను రాత్రివేళల్లో తరలిస్తున్నారు. సమీపంలోని కరీంనగర్, రామగుండం నగరాల నుంచి వాటిని గుట్టుచప్పుడు కాకుండా చేరవేస్తున్నారు. అధికార పార్టీ నేతలు, జిల్లా ఉన్నతాధికారుల అండదండలతో చెరువులను నిర్వహిస్తున్న ముఠా అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులో 150 ఎకరాల విస్తీర్ణంలోని ఇరిగేషన్ భూములను కబ్జా చేసిన అక్రమార్కులు 36 చెరువులను తవ్వారు. సమీప గ్రామాలకు చెందిన నలుగురితోపాటుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మరో ఏడుగురు కలిసి ఒక ముఠాగా ఏర్పడి చెరువులను నిర్వహిస్తున్నారు. ఈ విషయాలను 'నమస్తే తెలంగాణ' రెండు రోజులుగా వరుస కథనాలు ప్రచురిస్తున్నా, అధికార పార్టీ నాయకులు, జిల్లా ఉన్నతాధికారుల అండదండలతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఎల్లంపల్లి ఎగువున చేపల చెరువులను నిర్వహిస్తున్న అక్రమార్కులు, ఏకంగా ఎల్లంపల్లి రిజర్వాయర్ నీటిని కలుషితం చేస్తున్నారు.

### రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా..

చెరువుల్లో చేపలకు మేతగా కోళ్ల కాళ్లు, పేగులు, తోళ్లు, ఈకలు, మేక మాంసానికి చెందిన బక్కీ తదితర వ్యర్థాలను పడేస్తున్నారు. నిత్యం కరీంనగర్, రామగుండం నగరాల్లో చికెన్, మటన్ సెంటర్ల నుంచి ఆ వ్యర్థాలను సేకరించి రాత్రివేళ 9 నుంచి 11 గంటల సమయాల్లో ప్రత్యేక వాహనాల్లో చేపల చెరువుల వద్దకు చేరవేస్తుననారు. అక్కడే ఆ వ్యర్థాలను ఉడికించి చేపలకు మేతగా వేస్తున్నారు. ఉడికించేందుకు చెరువుల వద్ద ప్రత్యేక పాత్రలను ఏర్పాటుచేశారు. చేపల మేతకు అవసరమైన ముడి పదార్థాల ధరలు పెరగడంతోనే వ్యర్థాలను ఆహారంగా అందిస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఆరు నెలల్లో కిలో సైజు వరకు పెరగాల్సిన చేపలు కేవలం మూడు నెలల్లోనే అనుకున్న సైజు పెరిగేలా చేస్తున్నారు. వాటిని హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దిగువన ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వదులుతూ, జలాశయాన్నీ కలుషితం చేస్తున్నారు.

### ప్రజల ప్రాణాలతో చెలగాటం

చికెన్, మటన్ వ్యర్థాలతో చేపలను పెంచుతున్న అక్రమార్కులు, చెరువుల్లో విషతుల్యమైన జలాలను 15-20 రోజులకు ఒకసారి మార్చుతున్నారు. ఎల్లంపల్లి జలాశయం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మోటర్ల ద్వారా చెరువుల్లోకి నీటిని నింపుకుంటూ, అప్పటికే చెరువుల్లోని కలుషిత జలాలను మరోమార్గం ద్వారా ఎల్లంపల్లిలోకి వదులుతూ జలాశయ నీటిని విషతుల్యం చేస్తున్నారు. ఈ చెరువుల దిగువనే హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ స్కీం ద్వారా ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి రోజూ 177.88 ఎంజీడీల రా వాటర్‌ను హైదరాబాద్ నగరానికి సరఫరా చేస్తున్నారు. అంతర్గాం మండలం ముర్మూర్‌లో 160 ఎంఎల్‌డీ సామర్థ్యం గల మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌కు సైతం ఈ చెరువుల నుంచి వచ్చే కలుషితమైన నీరే సరఫరా అవుతున్నది.

### ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

ఎల్లంపల్లి భూములను కబ్జాచేసి ఏర్పాటు చేసిన చెరువుల్లో మాంసం వ్యర్థాలతో చేపలను పెంచుతున్నారని పలువురు స్థానికులు పెద్దపల్లి జిల్లా మత్స్య శాఖ అధికారి నరేష్‌కుమార్ నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ అధికారి అంతర్గాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వెంటనే చెరువుల నిర్వాహకులను తీసుకొచ్చి బైండోవర్ చేస్తామని, ఆ సమాచారం మత్స్యశాఖ అధికారులకు ఇస్తామని తొలుత పోలీసులు పేర్కొన్నారు.

- నల్లమలలో పెద్దపులి


నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల ప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలోని ఫర్హాబాద్ గుండం సమీపంలో మంగళవారం సఫారీ యాత్రికులకు మరోసారి పెద్దపులి కనిపించింది. ఏటీఆర్‌లో పెద్దపులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని సఫారీ యాత్రలో నాలుగైదు సార్లు పెద్దపులి కన్పించిందని జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి తెలిపారు. -అమ్రాబాద్